# బందీ

మనిషికెదురయ్యే కష్టాలు చాలా వున్నాయి. కానీ చిన్నారావు కెదురైన కష్టం మాత్రం... ఏమనాలి దాన్ని? చాలా చిత్రమైనది అనొచ్చు.

ఈ భూ ప్రపంచకంపైన అలాంటి కష్టం ఒకటి వుంటుందని ఊహించడంగూడా కష్టమే.

అది దైవికంగా కలిగింది గాదు. స్వప్రయత్నంతో అతడు కొనితెచ్చుకున్నదీ కాదు. తనతో నిమిత్తం లేకుండా ఇంకొకరు వాడి తలపైన రుద్దింది. ఈ రుద్దినవాడు స్వయానా వాళ్ళన్నయ్య సత్తిరాజు.

సత్తిరాజు కర్త? చిన్నారావు కర్మ. కష్టమంటూ పేర్కొన్నానే అది క్రియ. ఇప్పుడిక కర్త, కర్మ, క్రియలను గురించిన వివరణ తప్పనిసరి.

మనిషి సన్నగా వుంటాడు. అలాగని పొడుగైన వాడేమీ కాదు. పొట్టి క్రాపింగు. గుండ్రని ముఖం. ముకుపుటాల క్రింద అతికించినట్లుగా పలచటి మీసాలు. పాదాల దగ్గరకు దిగను దిగనూ సన్నగిల్లి కాళ్లకు అతుక్కుపోయినట్టు కనిపించే పాంటు, పైన అరచేతుల ఖద్దరు చొక్కా. 'కీ' ఇచ్చి వదిలిపెట్టిన మర బొమ్మలా అతడు వీధంట చకచకా నడచిపోతుంటే మొదటిసారిగా చూచాను. విచిత్రవేషధారణలో 'పిట్టలదొర' అనే వేషం ఒకటుంది. పాత కోటొకటి తగిలించుకుంటే అతడు పిట్టల దొర వేషానికి సరిపోయేటట్టున్నాడు.

అతణ్ణి గురించి నేనప్పుడంతగా పట్టించుకోలేదు.

ఎందుకంటే

నాలుగువందల గడపలున్న మా వూళ్ళో చుట్టపు చూపుగా బంధు దర్శనార్థం ఎవరోకొందరు వచ్చి వెళ్తుండడం మామూలే!

పసిరికలు, పురుగుకాటు, రేచీకటి లాంటి జబ్బుల్ని కొన్ని నాటుమందులతోనే నయంచేసే చిట్కావైద్యానికి మా వూరు ప్రసిద్ధి. అలాంటి చికిత్సలకోసం గూడా ఎవరెవరో కొత్తవాళ్ళు మా వూరికి రావడం పరిపాటి.

పల్లెటూరైపోయింది గదా, తమలపాకులు, కనకాంబరం పువ్వులు, కూరగాయలు, చింతగింజలు, గోగునార ఇంకా అలాంటి వాటి కొనుగోలు కోసం ఎవరైనా ఆసాములు మా వూరికి రావడమున్నూ రివాజే.

వీధంట మరబొమ్మలా నడిచిపోతూ కనిపించిన వ్యక్తిపై మూడు వర్గాల్లో దేనికో ఒక దానికి చెందిన వాడై వుండొచ్చునని నేననుకున్నాను.

అయితే ఆగంతకుడి విషయంలో నా ఊహ చెల్లని కాసైపోయింది.

పంచదార తక్కువనీ పాలు చాల్లేదనీ అతడు టీ కొట్టువాడితో పేచీ పడుతుండగా చూచాను. కట్టపైన నిలబడి చెరువులోని చేపల పరిమాణాన్ని గురించి బెస్త దానయ్యతో

మాట్లాడుతూండగా చూచాను. ఇన్‌లాండ్ కవరులో అదనంగా యింకొక చిన్న కాగితం పెట్టి పోస్ట్ చేస్తే అందువల్ల డిపార్ట్‌మెంట్‌కు నష్టమయ్యేదేముందని పోస్టు మాష్టరుగారితో వాదులాడుతుండగా చూచాను. ఇతగాడెవరోగానీ మా వూరి రంగస్థలం పైన ఒక స్థిరమైన వేషం వేయడానికి వచ్చిన బాబతేనని నేనప్పటికి గ్రహించాను.

ఈసారి నా ఊహ రైటే! అతడి పేరు సత్తిరాజు. మా వూరి పశుగణాభివృద్ధి కేంద్రంలో కాంపౌండరుగా, కొద్దిరోజుల క్రితమే ఛార్జి పుచ్చుకున్నాడని తెలిసింది. పేరుకు పెద్దదేగానీ ఈ పశుగణాభివృద్ధి కేంద్రం ఊరుకొక మూలగా ఒక చిన్న కట్టడంలో నిక్షిప్తమై ఉంటుంది. అందులో కాంపౌండరే ఉన్నతోద్యోగి. అతని క్రింద మెసెంజరని ఇంకొకతనుంటాడు.

సత్తిరాజు వచ్చిన తర్వాత మా ఊరి పశువుల ఆస్పత్రికొక కొత్త చైతన్యం వచ్చినట్టే తోచింది. పని గంటల కాలంలో అక్కడి హడావుడి చెప్పతరం కాదు. అయితే ఒకటి. చేసే వైద్యంకన్నా అక్కడ జరిగే జబర్దస్తీయే ఎక్కువనిపించేది. పాపయ్య అనే రైతు ఒకాయన పొరబాటు వల్లనో, లేదా గ్రహచారంవల్లనో, డిస్పెన్సరీ కుర్చీలో కూర్చున్నాడట! పశువుల కాంపౌండరు కుర్చీలో పాపయ్య కూర్చోవచ్చునా? అని సత్తిరాజు పంచాయితీ పెట్టేశాడు. టేబిలుపైన పడివుండిన కత్తెరతో ఓ కుర్రాడు కాగితం కత్తిరించాడట! ఆసుపత్రి కత్తెరనిలా దుర్వినియోగం చేసినందుకు సత్తిరాజు అగ్గి రాముడైపోయాడు. ఇంతలో ఎవరో జానెడు పొడుగు గీతలపైన తాటికాయంత తలకాయను చిత్రించి దానికి 'సత్తిరాజు' అని పేరు కట్టేశారు. ఆ బొమ్మవైపు చూస్తూ సత్తిరాజు వేసిన చిందులు వర్ణనాతీతం. కనిపించిన ప్రతి పెద్దమనిషినీ నిలవేసి "ఏమండీ! గోడపైన బొమ్మను చూచారా? మీ ఊరి న్యాయం ఇంతలోవుంది. ఛీ ఛీ, ఇలాంటి పనికిమాలిన కొంపను నేనే దిక్కుమాలిన దేశంలోనూ చూళ్ళేదు బాబూ!" అంటూ ప్రారంభించి పండ్లు పులిసిపోయేటట్టుగా దక్షిణాది వాళ్ళని తిట్టడం ప్రారంభించేశాడు.

అన్నట్టు సత్తిరాజుది ఉత్తరాది. అంటే ఉత్తర భారతదేశంగాదు. ఆంధ్రప్రదేశ్‌లోనే కొంచెం ఉత్తరంగా ఒక జిల్లా. సత్తిరాజు మాటల్ని బట్టి గ్రహించుకోవలసిందేమిటంటే ఆ జిల్లాలో జనం ఎంతో బుద్ధిమంతులు. వాళ్లు ఇతరుల కుర్చీల్లో కూచోరు. వస్తువులు తాకరు. గోడలపైన బొమ్మలు గియ్యరు. గంగిగోవులు.

ఒకటి మట్టుకు నిజం. సత్తిరాజు రాక మునుపు మాకు రోజులు చాలా చప్పగా గడిచిపోయేవి. వాటిని వీలైనంత రసవత్తరంగా మార్చడానికి సత్తిరాజు తన శాయశక్తుల ప్రయత్నిస్తూ వచ్చాడు.

సత్తిరాజు వున్నచోట సందడి, సందడి జరిగేచోట సత్తిరాజు అంటూ అతడి వునికిని గురించి ఒక దృఢమైన అభిప్రాయం ఏర్పడిపోయింది.

అలాంటి సత్తిరాజు ఒకనాడు వున్నట్టుండి స్కూల్లో ప్రవేశించి "ఎక్కడ? హెడ్మాస్టరుగారెక్కడా?" అని ప్రశ్నిస్తూ అట్టహాసంగా నా గదిలో జొరబడ్డాడు.

"కూచోవయ్యా సత్తిరాజూ కూచో! ఏం పనిమీదొచ్చావ్?" అంటూ ఆసనం చూపించాను.

'ఇహీహీ' అంటూ పళ్ళికిలించి "నాకొక తమ్ముడున్నాడండీ మేస్టరుగారూ!" అన్నాడు సత్తిరాజు.

"లేడనిగానీ, ఉండకూడదనిగానీ నేననలేదే!"

"నిన్ననే వచ్చాడు. వాళ్ళ వదినా, వాడూ యిద్దరూ వచ్చారులెండి! వాడ్నిక్కడ మీ స్కూల్లో చేర్పించాలి..."

"భేషుగా చేర్పించొచ్చు. ఏ క్లాసు?

"అదేనండి వచ్చిన చిక్కు. మా వూళ్ళో మూడో నాలుగో చదువుతూ వుండేవాడా, హఠాత్తుగా మా అమ్మానాన్నా పోవడంతో చదువు చాలించేశాడు."

"ఇప్పుడెన్నేళ్ళుంటాయి వాడికి?"

"ఉంటాయి, పద్మూడో, పద్నాలుగో వుంటాయి ఇప్పుడిక ఏకంగా వాణ్ణి హైస్కూల్లోనే చేర్పించాలని ఉద్దేశం. అందాకా వాడు అయిదో తరగతిలో కూచోడానికి మీరు అనుమతించాలి."

"అబ్బే, అదెలా సాధ్యమవుతుందయ్యా సత్తిరాజూ! ఓ కుర్రాడు స్కూల్లో చదువుకోవాలంటే వాడి పేరు ముందుగా అడ్మిషన్ రిజిష్టరులో నమోదై వుండితీరాలి. అనామత్తుగా కుర్రాళ్ళని బడిలో కూచోబెట్టడానికి వీల్లేదే!" అన్నాను.

"సార్, ఏమిటండీ మీరూ!" నా అసమర్ధతకు నొచ్చుకుంటున్నట్లుగా అన్నాడు "సత్తిరాజు ఇదే మా ఉత్తరాదిలో నైతేనా" అంటూ వెంటనే మొదలంకించుకున్నాడు. వాళ్ళ ఉత్తరాదిలోనైతే అడ్మిషన్ రిజిష్టర్లో పేర్లుంటాయేగానీ, బడిలో కుర్రాళ్ళుండరట! అయ్యవార్లుగూడా వంతుల ప్రకారంగా వారానికొకరు స్కూల్లో వుంటే మిగిలిన వాళ్ళందరూ వాళ్ళవాళ్ళ ఇళ్ళ దగ్గర స్వంత పనులు చూచుకుంటారట! బడి తనిఖీకి రాదలచుకున్న పై ఆఫీసర్లుగూడా ముందుగా విజ్ఞాపనం పంపుకుని టీచర్ల అనుమతి పొందిన తర్వాత మాత్రమే బడివైపు తిరిగి చూస్తారట! 'చూచారా, రామరాజ్యంటే అదీ! అలా వుండాలి' అన్నట్టు నావైపు సగర్వంగా చూచాడు సత్తిరాజు.

సత్తిరాజుతో రగడ ఇష్టంలేక 'సరేలేవయ్యా! అలాగే పంపించు" అన్నాను.

పెద్ద రెక్కలతో ఒళ్ళంతా కప్పుకునే బొంతగద్దలా, వాళ్ళన్నకు చిన్నదైపోయిన ఓ పాత చొక్కా తొడుక్కుని చిట్టెలుకల్లో పందికొక్కులా మరునాటి ఉదయం అయిదో తరగతి గదిలో కానవచ్చాడు చిన్నారావు.

ఒక పుస్తకం చేతికిచ్చి చదవమన్నాను.

"దీన్ని నేనెప్పుడూ చదవలేదు సార్!" అన్నాడు చిన్నారావు (అప్పటి కతడేవో వందలు, వేలూ గ్రంథాలు చదివినట్టు!)

"పోనీ, మీ ఊళ్ళో చదివిన పుస్తకమేది?" అని అడిగాను.

"అదిప్పుడు లేదుసార్! చిరిగిపోయింది" అన్నాడు చిన్నారావు.

"పోనీ, అక్షరాలేమైనా గుర్తున్నాయా?"

చిన్నారావు నావైపు ఛీక్కరించి చూచాడు. పలక ఒకటి చేతికిప్పించి పది పదాలు డిక్టేషన్ వ్రాయమన్నాను. వ్రాసిన పదాల తీరునుబట్టి చూస్తే అతడు తెలుగు భాషకేదో

హ్రస్వలిపి కనిపెట్టినట్టు తోచింది. దీర్ఘాలు, గుళ్ళు, కొమ్ములు, అనుస్వారాలు మొదలైన గొడవలేవీ అతనికి కాబట్టినట్టు లేదు. లేదంటే అచ్చులలోను, హల్లులలోను మచ్చుకు కొన్ని అక్షరాలు మాత్రం అతడి ఎరుకలో వున్నట్టున్నాయి. ఈపాటి పరిజ్ఞానాన్ని బట్టి వాడినిప్పుడు ఆక్షేపణ లేకుండా మొదటి తరగతిలో చేర్చుకోవచ్చు. ఈ లెక్కన ఇరవై యేళ్ళొచ్చేటప్పటికి వాడు ఆరోక్లాసులో వుంటాడు!

అయినా ఈ కుర్రకుంక చదువుకుని తీరాలని సత్తిరాజుకు పట్టింపేమీ లేదని నాకు కొద్ది రోజుల్లోనే తెలిసిపోయింది. మునుపటి కెవడో భర్త భార్యతో నేను కొట్టినట్టే కొడతాను నువ్వు ఏడ్చినట్టే ఏడువు' అన్లేదా. సత్తిరాజు చిన్నారావును చదివించడంగూడా అందుకు భిన్నంగా లేదు. తాను తమ్ముడ్ని చదివిస్తున్నట్టుగా లోకుల్లో ఒక భ్రమను కలిగించడం బహుశా అతడి వుద్దేశమై వుండొచ్చు. చిన్నారావు స్కూలుకు రావడమే గగనం. వచ్చినా సకాలంలో రాడు. అప్పుడైనా ఆఖరు గంట కొట్టేదాకా బడిలో వుంటాడన్న గ్యారంటీ వుండదు. అన్నగారి దగ్గరినుంచిగాని, వదినగారి దగ్గరినుంచిగానీ ఏ క్షణాన్నయినా పిలుపు రావచ్చు. బియ్యం దగ్గరినుంచి అగ్గిపెట్టేదాకా ఇంటి కే వస్తువు కావలసివచ్చినా తీసుకురావడం వాడివంతే. పొలాలపైన తిరిగి కూరగాయలు తేవాలి. ఇర్లవాళ్ళ గుడిసెల దగ్గరకు వెళ్ళి కట్టెలమోపు లెత్తించుకరావాలి. చెంబు చేతబట్టుకొని నెయ్యి కోసం యింటింటికీ తిరిగి వాకబు చెయ్యాలి. ఇక కోళ్లూ కోడి గుడ్లు సరే సరి! చూడబోతే ఆ కుటుంబ జనాభా వుద్దకొకటి తక్కువే! కానీ ఆ యింట్లో ఎప్పుడూ ఒక యజ్ఞం జరిగినంత హంగామా!

సత్తిరాజు కీర్తి మరింత దట్టంగా అలముకోడానికి అతని భార్య రాధారాణి గూడా వీలయినంతలో బాగా తోడ్పడిందనే చెప్పాలి. ఇటువైపు ఇళ్ళూ, గుళ్ళూ, బళ్ళూ మొదలైనవి మాత్రమే గాదు, మా ఊరి గాలి, నీళ్ళు గూడా ఆమెకు నచ్చేవి గావు. కట్టుకున్న చీరను గురించి, వేసుకున్న జాకెట్టును గురించి పెట్టుకున్న కొప్పును గురించి ఆమె ఎలాంటి రిమార్కులు పాస్ చేస్తుందోనని మా వూరి ఆడవాళ్ళు హడలి చచ్చేవాళ్ళు. సంఘ జీవనంలో తనకు తావు అలభ్యం కావడంవల్ల గృహ సామ్రాజ్యంలో ఆవిడ విశృంఖల వీరతాండవానికి ఎదురు లేకపోయింది. బయటి ప్రపంచంలో తోడేలు కొదమలాంటి సత్తిరాజే ఆమె దగ్గర పునుగు బిల్లిలా తోక ముడుచుకునే వాడంటే యిక చెప్పవలసిందేముంది? ఆమె అనుగ్రహానికి పాత్రం కావడానికి అతని కొక్కటే దారి. చిన్నారావుని చితకబాదడం! ఆవిడ మరిదిపైన ఒక నేరం మోపడమే ఆలస్యం. వాడి శరీరంపైన చమ్డా తోలు లేచిపోయేది. ఈ యాతననించీ తాత్కాలికంగానైనా విముక్తి లభించేది ఏ వారం పదిరోజులకో వాడు బడి ముఖం చూచినప్పుడే! ఇక్కడ పని చెప్పేవాళ్ళు లేరు. చీవాట్లు పెట్టేవాళ్ళు లేరు. వెనకా ముందు చూడకుండా తన శరీరంపైన భుజబలం ప్రదర్శించేవాళ్ళు లేరు. ఆహా పాఠశాల ఎంత మంచిది!

మా వూరి ప్రేక్షకుల ఎదుట సత్తిరాజు లీలలు ప్రారంభమై నిండుగా ఒక సంవత్సరమైందో లేదో, గాలి పోవిడిగా ఒక వార్త మా చెవిదాకా వచ్చింది. అందులోని నిజానిజాలను గురించి చెబితే సత్తిరాజే చెప్పాలి. కానీ అతడు అందక పొందక మనుషులకు

దూరంగా తప్పించుకుని తిరగడం మొదలెట్టాడు. ఈ వాలకం మరింత అనుమాన హేతువైపోయింది. సందేహం లేదు సత్తిరాజుకి ట్రాన్స్ఫరొచ్చిన మాట నిజమేనని అనుకోవలసి వచ్చింది. ఆ వచ్చిన ట్రాన్స్ఫర్ గూడా వాళ్ళ ఉత్తరాది వైపుకే వచ్చిందట. రొట్టెవిరిగి తేనెలో పడ్డట్టే గదా! మరింక దిగులెందుకు?

అసలు కిటుకిక్కడే ఉన్నట్టు తేలింది. చిల్లర కొట్టు శేషాద్రికి మూడు వందలు, జవిళంగడి చెన్నకేశవులుకు రెండువందల చిల్లర, నాస్టా హొటల్ లక్ష్మమ్మకు డెబ్బై అయిదు, కోళ్ళ ఫారం బుచ్చిరాజుకు నూట యాభై, మునసబు నాగిరెడ్డి దగ్గర రొఖ్ఖంగా చేసిన అప్పు రెండు వందల పాతిక – యిలా వివిధ పద్దుల క్రింద సత్తిరాజు వెయ్యిన్నీ రెండు వందలదాకా ఇచ్చుకోవలసి వున్నాడట! ఒకరితో ఒకరు కలిసి అందరూ కూడ బలుక్కున్నాక తెలిసింది.

"పెగ్గె మాటలతో పబ్బాలు గడుపుకున్నట్టుగాదు. అప్పు పైసలతో సహా చెల్లించకపోతే గదా అయ్యగారి పని తెలిసొచ్చేది! భద్రం, భద్రం ఊరినుంచీ ఎక్కడైనా ఉడాయించేను" అని ఆసాములు ఒకర్నొకరు హెచ్చరించుకున్నారు.

ఇంతలో సత్తిరాజును డ్యూటీనుంచీ రిలీవు చేసి ఛార్జీ పుచ్చుకోవలసిన ఉద్యోగి కాస్తా ఊళ్ళోకి వచ్చి దిగేసాడు. వచ్చిదిగిన కొద్ది గంటల వ్యవధిలోనే అతడు ఛార్జీ అప్పగించుకుని డిస్పెన్సరీకి గట్టిగా తాళం బిగించుకున్నాడు.

సత్తిరాజు గ్రుడ్లు మిటకరించాడు. గ్రుక్కిళ్ళు మ్రింగాడు. దిక్కులు చూచాడు. పగటిపూట ఈ వూరినుంచి బయట పడడమనేది ఊహించడానికైనా సాధ్యం కాని పని. రాత్రివేళ వెళ్ళాలంటే వీధి పొడుగునా మంచాలు వేసుకుని పడుకుంటారు. అన్ని దారులూ గమనించి, ఏ దారీ నిరపాయకరమైంది కాదని తేలిపోవడంతో అతడు హతాశుడైపోయాడు.

వారం రోజులు జాయినింగు టైంలో నాలుగు రోజులప్పుడే గడచిపోయాయి.

అంతర్గతంగా ఎందరెందరికో, ఏయే కారణాలవల్లనో సత్తిరాజుపైన కసిగా వున్నట్టుంది. పాపం! అవకాశం దొరికితే నూరి, కలిపి, త్రాగి, త్రేన్చేయ్యాలన్నంత కోపంగా వున్నారు.

ఎత్తుగడలన్నీ విఫలమైపోయిన తర్వాత లాస్ట్ ఛాన్స్ ఒకటి మిగిలింది సత్తిరాజుకు. చివరి సీనే గదా అనుకున్నాడేమో. అతడు దురభిమానమనే కోటు తీసి పెట్టేశాడు. తలబిరుసుతనమనే మేకప్పు తుడిచి పారేశాడు. కాలుగాల్చుకున్న పిల్లిలా యింటింటికీ తిరగడం మొదలుపెట్టాడు. కాళ్ళు పట్టుకోకపోవడమొకటే తక్కువ "బాబ్బాబూ! దయపెట్టండి బుద్ధి గడ్డితిని అప్పులు చేశాను. మీ అప్పు మీకు పువ్వుల్లో పెట్టి సమర్పించుకుంటాను. మావైపు గనుక వెళ్ళానంటే నాకు డబ్బు పుట్టించడం చిటికెలోపని. ముందు నన్ను వదిలి పెట్టండి. తిరిగొచ్చి మీ డబ్బులు మీకు ముట్టజెప్పకపోతే అప్పుడడగండీ" అంటూ గింజుకోసాగాడు.

"ఓ యబ్బో, అప్పుడడగాల్సిందే నిన్ను! అదేం కుదరదు. ముందు అప్పు చెల్లించు, తర్వాత బస్సెక్కు" అన్నారు ఊరి పెద్దలు.

తుపాకి గుండుకు భయపడిన శత్రు సైనికుడిలా సత్తిరాజు చేతులు రెండూ పైకెత్తి జోడించేశాడు – "అయ్యా! నమస్కారం. ఉద్యోగమొక్కటే నాకు బ్రతుకు తెరువు. మూడోనాటికల్లా నేను రెక్కలు గట్టుకు వెళ్ళి కొత్త చోట వాలకపోతే నా ఉద్యోగానికే ముప్పొస్తుంది. తరువాత నేను బ్రతికి నిష్ప్రయోజనం. నమ్మి విడిచిపెట్టినా సరే! లేకుంటే ఇక్కడే ఉరిబోసుకుని చావమన్నాసరే!"

మునసబు నాగిరెడ్డి కాస్త మెతక మనిషి "పోనీ ఏదయినా తాకట్టుగా పెట్టి వెళ్ళు" అన్నాడాయన.

భార్య వంటిపైన తాలిబొట్టు మినహా నగలేవీ లేవు. ఇంట్లో సత్తు గిన్నెల పటాటోపం తప్పితే మరొక విలువైన వస్తువేదీ లేదు. సత్తిరాజు బుర్ర గోక్కుంటూ ఆలోచనలో పడ్డాడు. ఆ బుర్రలో హఠాత్తుగా ఒక మెరుపు మెరిసింది. 'మంచిది. అలాగేనండీ నేను మా చిన్నారావుని యిక్కడే నిలిపి వెళతాను. డబ్బు తెచ్చి మీ అప్పులన్నీ చెల్లించేశాక తీసుకెళ్తాను" అన్నాడు. అలాగైతే అప్పుకు తాకట్టుగా భార్యనే ఇక్కడ దిగవిడిచి వెళ్ళగూడదా అని అడగడానికి సభ్యతా సంస్కారమూ అడ్డుతగిలాయి. పోనీలే, ఎవరుంటే నేమి? మన డబ్బు మనకు రావడమే గదా ముఖ్యం అన్న రాజీ ధోరణి గ్రామంలో కనిపించింది.

సత్తిరాజు తిరిగి వచ్చేదాకా అతడి కప్పులిచ్చిన వాళ్ళు రోజుకొకరు చొప్పున వంతులవారీగా చిన్నారావుకు భోజనం పెట్టాలని ఏర్పాటయింది.

రోజులు గడిచిపోతున్నాయి. రోజులు గడిచిన కొద్దీ సత్తిరాజు రాకకోసం జరుగుతున్న ప్రతీక్షలో ఆరాటమూ, ఆవేదన గూడా హెచ్చుతున్నాయి. సత్తిరాజు వస్తాడు. ఈ పాటికి రోడ్డులో బస్సు దిగి వుంటాడు. ధీమాగా ఊళ్ళోకి నడిచి వస్తాడు. క్యాష్‌బ్యాగు తెరచి ఎవరి అప్పు వారికి చెల్లిస్తాడు. 'వెళ్లొస్తానండీ! మా తమ్ముడిని తీసుకెళతాను' అంటూ సెలవు పుచ్చుకుంటాడు అన్న ఆశాభావం ఎండాకాలంలో ఏటి నీటి జాలులా సన్నగిల్లి పలచబడిపోతూ వచ్చింది. ఆ ఆశ సన్నగిల్లిన కొద్దీ ఆ మేరకు సత్తిరాజు పట్ల ఆగ్రహం రగులుకుంటూ వచ్చింది. తన సహజగతి ననుసరించి ఈ ఆగ్రహం చిన్నారావుపైకి మళ్ళవలసిందే! కానీ ఈలోగా చిన్నారావు వారాల పద్ధతిలో దొరికే దండగ తిండికోసం వేచి వుండడం మానేసి, తన కాళ్ళపైన తాను నిలబడే ప్రయత్నాలు చేయసాగాడు. కమ్మరి భద్రయ్యకు కొలిమితిత్తి ఊదడం, వడ్రంగి శంకరాచారికి 'బరమా' పట్టడం, గానుగలో చెఱుకులు పెట్టడం, తమలపాకులు కట్టలు గట్టడం, తీగల్లోనుంచి వేరుశనగ కాయలు ఒలిపించడం యిలా ప్రత్యేక కౌశలంతో అక్కరలేని ఏ పనికైనా సరే నేనున్నానని చిన్నారావు సిద్ధపడిపోతూ వచ్చాడు. తెల్లవారేసరికి ఏ ఐదారు కుటుంబాల వారికైనా అతడితో పని తగిలేది. కొందరు జాగ్రత్తపరులు రానున్న వారం పదిరోజుల వరకు ముందుగానే అతడ్ని బుక్ చేసుకోడం గూడా ఒక రివాజైపోయింది.

చిన్నారావు స్వయంగా పొట్టపోసుకుంటున్నాడని మాత్రమే ఆదిలో అనుకోవడం జరిగింది కానీ రెండు నెలలు గడిచేసరికి అతడొక వందరూపాయలదాకా మిగిలించి ఏవో కొన్ని అప్పులుగూడా తీర్చేశాడని తెలియవచ్చింది.

'ఈ పని చేస్తున్నావు గదా! ఇందువల్ల నీ కొరిగేదేముంది?' అని అడిగితే చిన్నారావు చెప్పుకోగల బదులేమీ లేదు. తాను నిర్వహిస్తున్నది ఒక విధంగా కర్మయోగమనిగూడా అతనికి తెలియదు. ఒకరి మెప్పుకోసం చేస్తున్న పని అసలేగాదు. ఒక పిచ్చి మొద్దు చిన్నారావు! పగలంతా ఒళ్ళువంచి పని చేయడం, రాత్రుల్లో ఆదమరచి ఏ అరుగుమీదనో నిద్రపోవడం – ఇలా ఒక మంచి శ్రామికుడుగా అతడు మా వూరి సామాజిక జీవనంలో అంతర్భాగమైపోయాడు.

ఒక్కటే ధ్యేయం అతనికి, అన్నగారిని ఋణ విముక్తుడ్ని చేయడం, అన్నను ఋణ విముక్తుడ్ని చేయడం ద్వారా తానీ వూరి బందిఖానానుంచి విముక్తి పొందడం. చిన్న లోటాతో పెద్ద తొట్టిలోని నీళ్ళను తోడేసినంత నిదానంగా ఈ ధ్యేయం పరిపూర్తి గావడానికి ఎంత లేదన్నా రెండేళ్ళ కాలం పట్టింది.

అంతపనీ సాకల్యంగా జరిగిన తర్వాత పంజరం తలుపు తనంతటదే తెరుచుకుంది. రెక్కలొచ్చిన పిట్టలా చిన్నారావందులోనుంచి తుర్రున ఎగిరిపోయాడు.

పిట్ట పంజరంలోంచి ఎగిరిపోవడంకన్నా కథకు కావలసిన ముగింపేముంటుంది? చిన్నారావు కథ అంతటితో పూర్తి కావలసిందే, అయితే మమ్మల్ని విస్మయ సముద్రంలో ముంచి పారేస్తూ వెళ్ళిన పదిహేను రోజులకల్లా చిన్నారావు మళ్ళీ ప్రత్యక్షమైపోయాడు. ఎందరెందరు ఎన్ని విధాలుగా ప్రశ్నించినా ఉలకడు, పలకడు! అతడలా తిరిగి రావడం గురించి ఊహాగానాలు మాత్రం ఎడతెగకుండా కొనసాగుతూ వచ్చాయి. అన్నకు తమ్ముడికీ మధ్య గొడవ ఏర్పడి వుండొచ్చు. లేదా వదినగారు ఈ మరిదిని యింట్లో వుంచుకోడానికి యిష్టపడి వుండక పోవచ్చు. మూడేళ్ళపాటు దక్షిణాదిలో గడపడంవల్ల చిన్నారావు కొకవేళ ఉత్తరాది గాలీ నీళ్ళూ సరిపడకపోయి వుండొచ్చు.

ఒకనాడు ఏకాంతంలో చిన్నారావు ఎదుట ఈ సందేహాలన్నీ బయటపెట్టి చూచాను. ఊహూ ఊహూ అని అన్నింటికీ తలతిప్పుతూ వచ్చాడు చిన్నారావు. ఆఖరుకు విసుగెత్తి "అయితే యింకా బింకమెందుకు? ఈ వూరు నాకు నచ్చింది అందుకని వచ్చేశానని చెబితే పోలా!" అని దబాయించి చూచాను. 'అబ్బే, కాదండీ!' అన్నాడు చిన్నారావు.

ఎవరైనా వినిపోతారేమోనని చుట్టూరా కలయజూచి, ఎవ్వరూ లేరని నిర్ధారణకు వచ్చిన తర్వాత మెల్లగా నా చెవిలో ఊదాడు చిన్నారావు.

"మేష్టరుగారూ! మా అన్నయ్యకు మళ్ళీ యింకొక వూరికి ట్రాన్స్‌ఫరొచ్చింది!"

♦ *స్వాతి మాసపత్రిక – 1977* ♦